క్లుప్తంగా

అభ్యర్థుల వ్యయాల పరిశీలన



సమావేశానికి హాజరైన అభ్యర్థులు

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు ఏ.ఆసిఫ్ కోరారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే అభ్యర్థులు, ప్రధాన ఎన్నికల ఏజెంట్లతో వ్యయ ఖర్చులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో, ఆర్డీఓ జేఎస్ రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వ్యయ పరిశీలకులు ఆసిఫ్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను సజావుగా, పకడ్బందీగా అమలు చెయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అభ్యర్థుల వ్యయ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల సమయంలో వ్యయ నిబంధనలతో కోడ్‌పై మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, డీటీ భానుకుమార్, పద్మజ తదితరులున్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

సామర్లకోట: ఈనెల 13వ తేదీన జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటరు స్లిప్పులను వీఆర్వోలు ఆయా వార్డుల్లో జోరుగా పంపిణీ చేస్తున్నారు. గతంలో ఓటరు స్లిప్పులను ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తరపున పంపిణీ చేసేవారు. అభ్యర్థుల తరపున ఓటరు స్లిప్పులు పంపిణీ చేసే సమయంలో ఓటర్లను ప్రలోభ పరిచే అవకాశం ఉన్నదని, దీనిని దృష్టిలో ఉంచుకుని బీఎల్ఓలే స్లిప్పులు పంపిణీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయడం ఈ ఏర్పాటు చేశారు.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

గొల్లప్రోలు: ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని గొల్లప్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.సుబ్బారావు సూచించారు. వైద్యారోగ్య శాఖ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎండల తీవ్రత, వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యారోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గొల్లప్రోలు పట్టణం, మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు గురువారం ఆగ్రహారం సీఎంసీ సీఎస్ఎం శిక్షణ విద్యార్థులు అవగాహన కల్పించారు. ఎండల తీవ్రత తగ్గే వరకూ ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. అత్యవసరమైతే తప్ప ఎండ సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లవద్దని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: పట్టణ పరిధిలో శుక్రవారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీ డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో 11 కేవీ ఫీడర్ల మరమ్మతుల వల్ల సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించాలన్నారు.

రీపోల్‌కు అవకాశం ఇవ్వొద్దు



ఈవీఎంల పనితీరును వివరిస్తున్న ఆర్డీఓ

పెద్దాపురం: ఎన్నికల సిబ్బంది వారి విధులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.సీతారామారావు అన్నారు. పెద్దాపురం లూథరన్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పీఓ, ఏపీఓల రెండో విడత శిక్షణ తరగతులను గురువారం ఆయన పరిశీలించారు. పీఓ, ఏపీవోలు సమన్వయంతో పని చేయాలన్నారు. మాక్‌పోల్ అత్యంత కీలకమని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్ పనితీరు, పీఓ డైరీ, ఇతర డ్యాకుమెంట్లు పూర్తి చేయడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం ఈవీఎంల పనితీరు, పోలింగ్ ప్రక్రియ, పోలింగ్ అధికారుల విధులు, ఓటింగ్ కంపార్టుమెంటు, బ్యాలెట్ బాక్సుల ఆపరేటింగ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆర్డీవో కార్యాలయ ఏవో సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పెద్దాపురం, సామర్లకోట తహసీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు కేవీ పద్మావతి, రామారావు, డిప్యూటీ తహసీల్దార్ పద్మజ, భానుకుమార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఓటు వేయండి

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొణిదెల నాగబాబు సూచించారు. మండలంలోని వాకతిప్ప ఎండీ పేట వాసులు, స్థానిక సురక్ష ప్యాలస్‌లో గురువారం భవన నిర్మాణ కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. పలువురు జనసేన పార్టీలో చేరగా వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకూ కూటమి ప్రభుత్వంలో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జ్యోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో పరుగులు

- చేబ్రోలులో అభివృద్ధి జల్లు
- ఐదేళ్లలో సుమారు రూ.120 కోట్లతో పనులు
- ప్రధాన సమస్యలకు పరిష్కారం
- మోడల్ గ్రామంగా తీర్చిదిద్దిన ప్రభుత్వం

పిఠాపురం: గొల్లప్రోలు మండలంలో 216వ నంబర్ జాతీయ రహదారిని అనుకుని ఉన్న ఒక చిన్న గ్రామం చేబ్రోలు. మాగాణి, మెట్ట భూములు కలిగిన వ్యవసాయాధారిత గ్రామం ఇది. దేశంలో ఎక్కడా పండని పొట్టి మిర్చికి కేరాఫ్ అడ్రస్ చేబ్రోలు. ప్రత్తి, పట్టు, మిర్చి, ఉల్లి వంటి ప్రధాన వాణిజ్య పంటలకు పుట్టినిల్లు. గతంలో చెంబుబ్రోలుగా పిలవబడే ఈ గ్రామం ప్రస్తుతం చేబ్రోలుగా మారింది. ఎన్నో ఏళ్లుగా నాయకులు మారుతున్నా ఈ గ్రామ రాత మారలేదు. 2019 సార్వత్రిక ఎన్నికల తరువాత ఈ గ్రామం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో గ్రామస్తులు ఆయనను కలిసి తమ గ్రామాన్ని అభివృద్ధి చేయాలని, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం వచ్చాకా కేవలం నాగున్నరేళ్లలో చేబ్రోలులో ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.120 కోట్ల నిధులు వెచ్చించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు సీఎం వైఎస్ జగన్.

సాగు నీటికి బోర్లు


గ్రామంలో మెట్ట భూములు ఎక్కువగా ఉండటంతో నీటి ఎద్దడి సమస్యతో రైతులు బాధపడేవారు. వర్షాధారంపైనే ఆధారపడి పంటలు పండించేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకా వైఎస్సార్ జలకళ పథకంలో రూ.48 కోట్లతో 1200 ఎకరాలకు సాగునీటిని అందించే బోర్లు నిర్మించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికి ఒకటి రెండు పంటలు పండించడమే గగనంగా ఉండే ఆ ప్రాంతంలో ఇప్పుడు నీటి సదుపాయం కలగడంతో ఏడాది పొడవునా పంటలు పండిస్తున్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ఇంటింటికీ కుళాయి పథకంలో భాగంగా గ్రామంలో వందలాది ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఇప్పటికే ఓవర్ హెడ్ వాటర్ టాంకు నిర్మించగా మరో రెండు నిర్మాణం చేపట్టారు. దీంతో దీర్ఘకాలికంగా ఉన్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది.

ఆర్బీకేలతో తీరిన కష్టాలు

సుమారు నాలుగు వేల మంది రైతులు, 10 వేలకు పైగా వ్యవసాయ భూములు కలిగిఉన్న చేబ్రోలులో వ్యవసాయానికి సంబంధించి ఏపని కావాలన్నా గొల్లప్రోలు, పిఠాపురం వెళ్లాల్సిన పరిస్థితి. అలాంటి పరిస్థితిని ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా మార్చేసింది. ఇప్పుడు రైతులు తమ ఇంటి పక్కనే ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని పనులు పైసా ఖర్చు లేకుండా చేయించుకుంటున్నారు. వాణిజ్య పంటలకు ప్రతి నిత్యం అధికారుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు.



చేబ్రోలు గ్రామ ఏరియల్ వ్యూ



నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం



గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు

చేబ్రోలు గ్రామ స్వరూపం

విస్తీర్ణం: 19.09 చదరపు కిలో మీటర్లు
జనాభా: 15,138,
స్త్రీలు 7175 మంది, పురుషులు 7423 మంది
వార్డులు – 16
కుటుంబాలు 4144
ఓటర్లు 11,667 మంది
పురుషులు 5992 మంది, స్త్రీలు 5675 మంది
పోలింగ్ స్టేషన్లు 13
రైతు భరోసా కేంద్రాలు 3,
గ్రామ సచివాలయాలు 3,
పీహెచ్‌సీ–1, హెల్త్ సబ్ సెంటర్లు–3, పశువుల ఆస్పత్రి–1

గ్రామంలో అభివృద్ధి ఇలా

గ్రామ సచివాలయాలకు: రూ.11.23 కోట్లు
వైఎస్సార్ జలకళలో 48 బోర్లకు: రూ.14.95 కోట్లు
గ్రామ సడక్ రోడ్లు నిర్మాణం – రూ 3.54 కోట్లు
పట్టు రైతులకు ఇన్సెంటివ్స్ – 2.71 కోట్లు
వివిధ పథకాల ద్వారా ప్రజలకు ప్రత్యక్ష లబ్ధి– రూ 71.39 కోట్లు
పరోక్షంగా ప్రజలకు చేకూరిన లబ్ధి – రూ 22.45 కోట్లు

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



ఎందరో ముఖ్యమంత్రులు వచ్చారు.. వెళ్లారు.. ఎవరూ మా గ్రామాన్ని అభివృద్ధి చేయలేకపోయారు. ప్రజా సంకల్ప యాత్రలో మా సమస్యలు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మా గ్రామం రూపురేఖలను మార్చేశారు. ఇలా అభివృద్ధి చేయడం ఎవరితరం కాదు. చిన్న గ్రామానికి కేవలం నాగున్నరేళ్లలో రూ.120 కోట్లు కేటాయించి అభివృద్ధి చేయడం అంటే మాటలు కాదు. అలా అభివృద్ధి చేయడం ఒక్క సీఎం జగన్‌కే సాధ్యం. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం. ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటాం.

– దొండపాటి లోవతల్లి, సర్పంచ్ గ్రామ పంచాయతీ, చేబ్రోలు

దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం



గతంలో ఒక నియోజకవర్గానికి కూడా ఇన్ని నిధులు ఇచ్చేవారు కాదు. అలాంటిది ఇప్పుడు ఒక గ్రామానికి ఇన్ని నిధులు ఇచ్చారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా గ్రామంలో అందరికీ పథకాలు అందేలా చేశారు. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపారు. మండల కేంద్రానికి వెళ్లాల్సిన పని లేకుండా అన్నిరకాల సేవలను ప్రజల ముంగిటకే తీసుకువచ్చారు. రూ.120 కోట్లకు పైగా ఒక గ్రామానికి వెచ్చించడం చరిత్రలో నిలిచిపోతుంది.

– వులవకాయల నాగలోవరాజు, జెడ్పీటీసీ, గొల్లప్రోలు మండలం

గ్రామ వలంటీర్ల రాజీనామా

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా గ్రామ వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాలకు చెందిన తొమ్మిది మంది వలంటీర్లు గురువారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. వాకతిప్పలో ఇద్దరు, శ్రీరాంపురంలో నలుగురు, గోర్సలో ముగ్గురు వలంటీర్లు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందచేసినట్లు ఎంపీడీఓ వెంకట నారాయణ తెలిపారు.

కబడ్డీ శిక్షణ శిబిరం ప్రారంభం



కబడ్డీ శిక్షణకు హాజరైన క్రీడాకారులు

సామర్లకోట: స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుతురులో సమ్మర్ కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ క్యాంప్‌ను ప్రోకబడ్డీ రిఫరీ బోగిళ్ల మురళీ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొండపల్లి శ్రీను, ఉపాధ్యక్షుడు నిమ్మకాయల కిరణ్, పీడీ తాళ్లూరి వైకుంఠం, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారిణి శ్వేత, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 2,36,409 మంది ఓటర్లు

పిఠాపురం: నియోజకవర్గంలో 2,36,409 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 1,18,183 స్త్రీలు 1,18,223, ఇతరులు ముగ్గురు ఉన్నట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామ్‌సుందరరెడ్డి తెలిపారు. గొల్లప్రోలు రూరల్‌లో 44319 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 22554 మంది, స్త్రీలు 21763, హిజ్రాలు ఇద్దరు ఉన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో 20617 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 10297, స్త్రీలు 10320 మంది ఉన్నారు. పిఠాపురం రూరల్‌లో 62093 మంది ఓటర్లు ఉండగా పురుషులు 31468, స్త్రీలు 30625 మంది ఉన్నారు. పిఠాపురం పట్టణంలో 42829 మందికి గాను పురుషులు 20669 మంది, స్త్రీలు 22159 మంది, ఇతరులు ఒకరు ఉన్నారు. కొత్తపల్లి మండలంలో 66551 మందికి గాను పురుషులు 33195 మంది, స్త్రీలు 33356 మంది ఉన్నారని వివరించారు. ఓటర్ల తుది జాబితా ప్రకారం ఉన్న ఈ ఓటర్లందరూ ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు.

మేనిఫెస్టోతో జీవన ప్రమాణాలు మెరుగు



మడికి సోనియా

సామర్లకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలతో పాటు క్రైస్తవులకు గుర్తింపు వచ్చిందని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మడికి సోనియా అన్నారు. గురువారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దివంగతనేత రాజశేఖరరెడ్డి వారసునిగా 2019లో ప్రకటించిన మేనిఫెస్టోలో 99 శాతం హామీలను అమలు చేశారన్నారు. రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా 2024 ఎన్నికలల్లో మేనిఫెస్టో రూపొందించారని తెలిపారు. సీఎం జగన్ ప్రకటించిన మేనిఫెస్టో ఒక భగవద్గీత, ఖురాన్, బైబిల్ వంటి పవిత్ర గ్రంథాలుగా భావిస్తున్నారని చెప్పారు. అటువంటి పార్టీ తరపున పోటీ చేసే నాయకులను గెలిపించుకోవలసిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు.

పులిమేరులో హోరెత్తిన ప్రచారం

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్, దొరబాబు సమక్షంలో చేరికలు

పెద్దాపురం: మండలంలోని పులిమేరు గ్రామంలో గురువారం రాత్రి వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబుల ఎన్నికల ప్రచారం హోరెత్తింది. భారీ స్థాయిలో కార్యకర్తలు, అభిమానులు గ్రామానికి పోటెత్తారు. ఈ సందర్భంగా గ్రామ సీనియర్ నాయకుడు తుమ్మల వరహాలయ్య, ఎంపీ అభ్యర్థి సునీల్ సోదరుడు మోహన్‌ల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన టీడీపీ మాజీ సర్పంచ్ తుమ్మల సూర్యకృష్ణమూర్తి, అజ్ఞావతి, సీనియర్ నాయకులు వెన్నా చిట్టిబాబు, తుమ్మల సురేష్, అయ్యన్నలతో పాటు సుమారు వంద మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు అభిమానులు పార్టీలో చేరారు. వారికి సునీల్, దొరబాబు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు బోనాసు గుర్రాజు, తుమ్మల అచ్యుత రామయ్యల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ రాష్ట్రంలో జరిగిన సంక్షేమాభివృద్ధిని ప్రజలు గుర్తించి వైఎస్సార్ సీపీకి ఓటేసి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గోపు నారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, ఎంపీపీ పెంకే సత్యవతి, తుమ్మల సుబ్బయ్యన్నాయుడు, పెద్ద, శ్రీను, సుందరెడ్డి రాజు, మలపరెడ్డి లోవ, సింగన చంటి, దాడి చంటి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్న సునీల్, దొరబాబు



పులిమేరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న సునీల్, దొరబాబు

స్థానిక ఎమ్మెల్యేతోనే అందరికీ న్యాయం

వేట్లపాలెంలో దవులూరి చంద్రకళ ప్రచారం

సామర్లకోట: నియోజకవర్గ పరిధిలోని వ్యక్తి ఎమ్మెల్యేగా ఉంటే అందరి సమస్యలపై అవగాహన ఉంటుందని, వైఎస్సార్ సీపీ నుంచి సామర్లకోటకు చెందిన తన భర్త దవులూరి దొరబాబు పోటీ చేస్తున్నారని ఆయనను గెలిపించాలని చంద్రకళ ఓటర్లను ఓట్లు అడిగారు. గురువారం వేట్లపాలెంలో ఆ గ్రామ నాయకులు వల్లూరి వీర్రాజుచౌదరి, ఎంపీటీసీ బొబ్బరాడ లక్ష్మీ, రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, ట్రస్టు సభ్యురాలు కర్రి వెంకట లక్ష్మీ, కౌన్సిలర్లు తదితరులతో ఇంటింట ప్రచారం చేశారు. ఆ గ్రామానికి చెందిన దివంగత ఎమ్మెల్యే కొండపల్లి కృష్ణమూర్తి, సామర్లకోటకు చెందిన ఉండవిల్లి నారాయణ మూర్తిలను ఆదర్శంగా తీసుకుని దొరబాబు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారన్నారు. ప్రతీ ఒక్కరూ ఫ్యాను గుర్తులపై ఎంపీ అభ్యర్థి సునీల్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థి దొరబాబును గెలిపించాలని కోరారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిడదవోలు సురేష్ చౌదరి, నాగనబోయిన రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీల పక్షపాతి సీఎం జగన్



సమావేశంలో మాట్లాడుతున్న యనమల కృష్ణుడు



పార్టీలో చేరిన వారితో వంగా గీత, యనమల కృష్ణుడు

- వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు
- చేబ్రోలులో యాదవులతో ఆత్మీయ సమావేశం

గొల్లప్రోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి, ఆత్మబంధువు అని వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు అన్నారు. మండలంలోని చేబ్రోలులో గురువారం జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు అధ్యక్షతన నియోజకవర్గస్థాయి యాదవుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత, పార్టీ నేత యనమల కృష్ణుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యనమల కృష్ణుడు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు బీసీల ద్రోహి అన్నారు. చంద్రబాబు రాజకీయ కుట్రలు, కుతంత్రాలకు ప్రజలు విస్తుపోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలంతా కలిసి పిఠాపురం ఎమ్మెల్యేగా వంగా గీత, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామన్నారు. వంగా గీత మాట్లాడుతూ బీసీలకు అధికంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులు కట్టబెట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో బలహీన వర్గాలకు వైఎస్సార్ సీపీ పాలనలోనే గుర్తింపు లభించిందన్నారు. జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా 200 మంది యాదవులు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి యనమల కృష్ణుడు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘ అధ్యక్షులు లాకా వెంగళరావు, కోయ్యా మురళి, యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేయాలి

సామర్లకోట: ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు డాక్టరు సంజీవ ఎం పాటిల్ అన్నారు. గురువారం సాయంత్రం పట్టణ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ డి.సురేష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో పూజలు

రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు డాక్టర్ సంజీవ ఎం పాటిల్ గురువారం పంచారామ క్షేత్రంలోని బాలా త్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా సామర్లకోట వచ్చిన ఆయన స్వామిని దర్శించుకోగా ఈఓ బళ్ల నీలకంఠం ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈఓ ప్రసాదం, స్వామి వారి ఫోటోను అందజేశారు. రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల పరిశీలకుడు పాటిల్‌కు వేదాశీర్వచనం చేస్తున్న పండితులు